హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కీసర: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్.రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మేడ్చల్ జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పసలేనిదిగా ఉందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదో పాలకులు ప్రజలకు తెలపాలన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ బలోపేతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులను ఘనంగా సత్కరించారు. బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్ నేతలు నరసింహులు, మహేష్‌యాదవ్, కోల్‌రాజ్, శ్రీనాథ్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శైలజ, హరినాథ్, పోచయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి.. అందరికీ అందేలా..!



- ఎంపీడీఓ, పురపాలకలతో సహా కలెక్టరేట్‌లో ప్రత్యేక కేంద్రం
- నాడు దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో గందరగోళం
- తప్పుల సవరణకు ఎడిట్ ఆప్షన్
- జిల్లాలో మొత్తం రేషన్ (ఆహార భద్రత) కార్డులు 5.23 లక్షలు
- లబ్ధిదారులు 2.24 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఉచిత కరెంటు అందించడానికి 'గృహజ్యోతి' పథకం ప్రవేశపెట్టి ఈ ఏడాది మార్చి నుంచి అమలు చేస్తోంది. 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ అందించే ఈ పథకం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులకు అందని ద్రాక్షగానే మిగులుతోంది. అనేక కారణాలతో జిల్లాలో 50 శాతం మంది గృహజ్యోతి లబ్ధికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో అర్హులకు పథకం వర్తించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

నాడు గందరగోళంగా ఆన్‌లైన్ నమోదు...

గతంలో ఇచ్చిన హామీల మేరకు ప్రజాపాలన దరఖాస్తులను జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం స్వీకరించింది. అనంతరం వాటిని కంప్యూటరీకరణ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేశారు. ఈ క్రమంలో ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ తదితర వివరాలను ఆపరేటర్లు సరిగా నమోదు చేయకపోవడం, తప్పులు దొర్లడంతో పథకాలకు చాలా మంది దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవలే కలెక్టరేట్, మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాల్లో జీరో బిల్లులు రాని వారి వివరాలను తిరిగి నమోదు చేసేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. అయితే కొత్తగా జీరో బిల్లుల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించకపోవడంతో ప్రజలు నిరుత్సాహం చెందుతున్నారు.

గృహజ్యోతి పథకం ఇలా...

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేషన్ (ఆహార భద్రత) కార్డులు 5,23,898 ఉండగా, గృహ విద్యుత్ వినియోగదారులు 15,14,262 మంది ఉన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకానికి దాదాపు 5.50 లక్షల దరఖాస్తు వచ్చాయి. ఇందులో 2,24,874 మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రతి నెల రూ. 8.97 కోట్ల సబ్సిడీ అందజేస్తోంది.

సవరణలకు ప్రత్యేక కేంద్రాలు...

గృహజ్యోతి పథకం అందని లబ్దిదారులకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా మందికి జీరో బిల్లులు (ఉచిత గృహ విద్యుత్ పథకం) రావడం లేదు. కొందరికి ఆహార భద్రత కార్డు లేకపోవటం, మరికొందరికి సరైన పత్రాలు లేకపోవటం, ఇంటి నంబర్లు, సర్వీసు నంబర్లు తప్పుగా నమోదు చేయటం, ఎక్కువ కనెక్షన్లు ఉండటం తదితర కారణాలతో పథకం వర్తించని పరిస్థితి నెలకొంది. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో బాధ్యుల వద్ద పొరపాట్లను సరిచేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం కల్పిస్తోంది.

కలెక్టరేట్‌లోనూ ప్రజాపాలన సేవా కేంద్రం...

ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీల్లో భాగంగా సవరణలు, దరఖాస్తులకు కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పథకాలు అందని వారు ఆందోళన చెందకుండా సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం కోరుతోంది.

విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించి ఎలాంటి అంతరాయం లేకుండా చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. 'అప్రకటిత విద్యుత్ కోతలతో పరేషాన్' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించారు. నూతనంగా 4 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించనున్నట్లు వారు స్పష్టం చేశారు. గ్రామస్తులు తమవంతు సహకరించాలని వారు కోరారు.

ఘనంగా భరోసా సెంటర్ వార్షికోత్సవం



భరోసా సెంటర్‌లో డీసీపీ సృజనా కర్నమ్ తదితరులు

మేడ్చల్: మేడ్చల్‌లోని భరోసా సెంటర్ రెండవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజనా కర్నమ్ హాజరై బాధితలతో మాట్లాడి వారికి కానుకలను అందజేశారు. భరోసా సెంటర్‌లో ఉన్న రేప్ కేసుల బాధితులు, పోక్సో బాధితులతో ఆమె మాట్లాడి వారికి సెంటర్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రెండేళ్లుగా మేడ్చల్‌లోని భరోసా కేంద్రం ద్వారా రేప్ కేసుల బాధితులకు, పోక్సో బాధితులకు తగితన సాయం అందజేస్తున్నామన్నారు. వారికి న్యాయ, ఆరోగ్య సేవలు అందిస్తూనే రెగ్యులర్‌గా కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. ఏహెచ్‌టీటీయూ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ కళ్యాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక సాయం అందజేయాలి

సాక్షి, సిటీబ్యూరో: అంబేడ్కర్ అభయహస్తం (గిరిజన బంధు) పథకం ద్వారా ఎస్సీ ఎస్టీలకు రూ. 12 లక్షల ఆర్థిక సాయం, పేద గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పక్కా ఇళ్లు లేదా ఇంటి స్థలంతో పాటు రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణ సాయం అందజేయాలని భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో, విద్య, ఇతర సంస్థలలో 12 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని కోరింది. విద్యాజ్యోతి పథకం కింద ఎస్టీ విద్యార్థులకు పదవ తరగతి పాస్ అయితే రూ. పదివేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 15 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ. 25 వేలు, పీజీ పాస్ అయితే రూ. లక్ష, పీహెచ్‌డీ, ఎంఫిల్ పాస్ అయితే రూ. ఐదు లక్షలు విద్యార్థుల విద్యాభివృద్ధి పథకం కింద అందజేయాలన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కేతావత్ సుధాకర్ నాయక్, జిల్లా నాయకులు గుగులోత్ వెంకటేష్ నాయక్, మాలోత్ వెంకటేష్ నాయక్, వంశీ భూక్యా గోపి నాయక్, రాజు నాయక్, రాము నాయక్, రామావత్ చెందర్ నాయక్, రాము నాయక్, హరిచేంద్ర నాయక్, వసంత్ కుమార్, మహిళా నాయకురాళ్లు సునీత నాయక్, స్వప్న నాయక్ పాల్గొన్నారు

సెక్యూరిటీ గార్డుల తొలగింపును ఆపాలి: ఏఐటీయూసీ

సాక్షి, సిటీబ్యూరో: ఘట్‌కేసర్ మండలంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో రెండు దశాబ్దాలుగా సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న 70 మందిని కనీసవేతనాలు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తున్న యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా నాయకులు శ్రీనివాస్ రవి చంద్రన్, జయ చంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

చర్లపల్లి పారిశ్రామికవాడలో విద్యార్థులు



పారిశ్రామిక సందర్శనలో ఎమ్మార్‌సీఈ విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ విద్యార్థులు శుక్రవారం చర్లపల్లి పారిశ్రామికను సందర్శించారు. అక్కడి ఏసీడీ కమ్యూనికేషన్ కంపెనీ సందర్శించిన ఈసీఈ విద్యార్థులకు అధ్యాపకులు యాంటినా వాటి నుంచి వెలువడే విద్యుత్ అయస్కాంత తరంగాలు, సాంకేతిక పరిణామాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అశోక్, ఈసీఈ హెచ్‌ఓడీ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీలను ఉపేక్షించం

సాక్షి, సిటీబ్యూరో: తమ కస్టమర్ల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం నకిలీలను ఏ మాత్రం ఉపేక్షించబోమని ప్రముఖ ద్విచక్ర వాహనాల బ్రాండ్ పియాజియో స్పష్టం చేసింది. తాజాగా నిర్మల్‌లో చట్టపరమైన దాడులను నిర్వహించి 70కి పైగా అనధికార విడిభాగాలు, ఉపకరణాలు, నకిలీ ప్యాకేజింగ్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్పేర్ పార్ట్స్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మలింద్ కపూర్ ఓ సమావేశంలో మాట్లాడుతూ అసలైన విడిభాగాలు అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలను కలిగి ఉంటాయని, పియాజియో ఒరిజినల్ స్పేర్ పార్ట్‌ల కొనుగోలు విషయంలో వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తండ్రి ఆస్తి ఇవ్వడం లేదని కుమార్తె ఫిర్యాదు

ఘట్‌కేసర్: మరణించిన తన తండ్రి ఆస్తిని ఇవ్వడం లేదని ఓ మహిళ ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల మేరకు... ఘట్‌కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేశ్ గత నెల 15న హత్యకు గురయ్యాడు. ఆయన మరణాంతరం అల్మారాలో ఉన్న మహేశ్ సంబంధించిన ఆస్తుల దస్తావేజులు, బంగారు, వెండి ఆభరణాలను మృతుడి సోదరుడు విఠల్, ఆడపడుచులు తీసుకొని తనకు ఇవ్వడం లేదని కూతురు గడ్డం తరుణి ఫిర్యాదు చేసింది. తండ్రి ఆస్తిపై కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్‌రూరల్: రాయిలాపూర్ గ్రామంలో శుక్రవారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి స్వరూప, మాజీ సర్పంచ్ నర్మదాగోపాల్‌రెడ్డి, వైద్యులు మూర్తి, మోనీషా, సంధ్య, మహేశ్, కో ఆర్డినేటర్ వెంకట్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



పీసు వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు మేరకు... నిజామాబాద్ ఆర్మూర్‌కు చెందిన పీసు వెంకట్‌రెడ్డి(19) పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటూ కీసర మండలం బోగారం హోలీ మేరీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం నుంచి వెంకట్‌రెడ్డి కనిపించడం లేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి మేనమామ జక్క మనోహర్‌రెడ్డి ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాయుధ దళాల పరాక్రమానికి ప్రతీక 'కార్గిల్ దివస్'



మాడిశెట్టి శ్రీనివాస్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

కీసర: దేశ సాయుధ దళాల ధైర్యం, పరాక్రమానికి ప్రతీక ఈ కార్గిల్ దివస్ అని సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. కార్గిల్ 25వ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం నాగారంలోని సెరినిటీ మోడల్ హైస్కూల్‌లో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న దమ్మాయిగూడకు చెందిన మాడిశెట్టి శ్రీనివాస్ బాబును నోముల జంగిరెడ్డి ఘనంగా సన్మానించారు. పారా మిలిటరీ జవాన్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బూర సైదయ్యగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు మెరుగు చంద్రమోహన్, రవీందర్, రవియాదవ్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు మెరుగు సునిత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న విద్యార్థుల అరెస్ట్

- 13 కేజీల గంజాయి స్వాధీనం
- కబాబ్ సెంటర్ కేంద్రంగా విద్యార్థులకు విక్రయం
- నలుగురు విద్యార్థుల అరెస్టు
- మొత్తం ఏడుగురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు



అరెస్టు చేసిన విద్యార్థులతో ఎక్సైజ్ పోలీసులు

మేడ్చల్‌రూరల్: జొమాటో బ్యాగులో గంజాయి తరలిస్తున్న విద్యార్థులను మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన విద్యార్థి సుతారి గుణశేఖర్(22), ఖమ్మం జిల్లా కొనిజెర్ల గ్రామానికి చెందిన విద్యార్థి చల్లమల్లి శరత్(23) శుక్రవారం మధ్యాహ్నం జొమాటో బ్యాగులో గంజాయి తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. పోలీసులు మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న 8.6 కేజీల ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా నల్లగొండ జిల్లా బోయగూడకు చెందిన మరో విద్యార్థి అవిశెట్టి అభిరామ్(21), నల్లగొండ జిల్లా లింగోజిగూడకు చెందిన విద్యార్థి ఎర్ర ఆదిత్య(22)లతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు నుంచి ప్రైవేటు వాహనంలో 40 కిలోల గంజాయిని తీసుకువచ్చి కరీంనగర్ జిల్లా వేములవాడలోని వ్యాపారి కటికెల వినయ్(24) ఇంట్లో నిల్వ ఉంచారు. అతడు నిర్వహించే కబాబ్ సెంటర్ కేంద్రంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు వినయ్, ఆదిత్యలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4.4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 13 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటి విలువ రూ. 13 లక్షలు ఉంటుందని తెలిపారు. రెండు రోజుల క్రితం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో దాడులు నిర్వహించి కార్తీక్, అరుణ్‌బాబు, కమల్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయి, రెండు వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నవనీత వివరించారు.

చిన్నారులకు జేఈ టీకాలు

కీసర: మెదడు వాపు వ్యాధి రాకుండా 15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ జేఈ టీకాలను తప్పక వేయించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతోపాటు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జేఈ టీకాలు వేయించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ కుమార్, రంగనాయకమ్మ, మాధవి, ఆశావర్కర్లు వాణి, సరిత, రేణుక, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదపై కమిషనర్‌కు ఫిర్యాదు

కీసర: రాంపల్లిలో వీధి కుక్కల బెడద తగ్గించాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు శుక్రవారం రాంపల్లికి చెందిన పలుకాలనీవాసులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో రాంపల్లి పరిధిలోని వివిధ కాలనీలో వీధికుక్కల బెడద అధికంగా తయారైందన్నారు. గతంలో పలువురు కుక్కకాటుకు గురయ్యారన్నారు. ప్రస్తుతం వీధికుక్కల బెడద వల్ల ఇళ్ల నుంచి చిన్నారులు బయటకు వెళ్లాలంటే బయపడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రాంపల్లిలోని వీధికుక్కలను పట్టించి దూరంగా తరలించాలని విన్నవించారు.

రూ 6.96 కోట్లతో అభివృద్ధి పనులకు తీర్మానం



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు రూ 6.96 కోట్లతో పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ మేరకు 15 అంశాలపై తీర్మానం చేశారు. చికెన్, మటన్ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు ఏజెన్సీ నియామకానికి ఆమోదం తెలిపారు. ట్రైబజార్ రద్దు తీర్మానాన్ని ఆమోదించారు. ఈనెల 28 న బోనాల ఉత్సవాల సందర్భంగా శ్రీ బంగారు మైసమ్మ దేవాలయాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించారు. ఎవరైనా ఏర్పాటు చేస్తే వాటిని వెంటనే తొలగించి పెనాల్టీ వేయాలని నిర్ణయించారు. అనంతరం మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం కౌన్సిల్ తీర్మానం చేసిన పనులకు టెండర్లు పిలిచి పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. తొలుత అత్యవసర పనులు చేయనున్నట్లు వెల్లడించారు. పాలకవర్గ సభ్యులందరిని కలుపుకుని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జవహర్‌నగర్‌లో పర్యటిస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: ప్రతి ఒక్కరూ తాము ఉంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ శాంతి అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిశుభ్రతను పాటించి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రజలకు కల్పిద్దామని, ఇంటి పరిసరాల్లో ఉండే మురుగునీటిని శుభ్రం చేసి ఆహ్లాదకరమైన వాతావరణం పొందేలా కృషి చేద్దామన్నారు. దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ హరిత, ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్‌అలీ, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థికి తీవ్రగాయాలు

ఘట్‌కేసర్: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి యాక్టివాతో ఓ విద్యార్థి ఢీకొట్టడంలో అతడికి తీవ్ర గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శుక్రవారం జరిగింది. బాధితుల సమాచారం మేరకు... యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జైనపల్లికి గ్రామానికి చెందిన శ్రీచరణ్(19) అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాల పూర్తి కాగనే ఘట్‌కేసర్ నుంచి జైనపల్లికి యాక్టివాపై వెళ్తుండగా హెచ్‌పీసీఎల్ వద్ద ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి ఢీకొట్టడంతో శ్రీచరణ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. 100 డయల్ చేయడంతో స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వైద్యం కోసం అతడిని ఉప్పల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

పంచాయతీల్లో స్వచ్ఛతే లక్ష్యం

- పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారం



సాక్షి, సిటీబ్యూరో: గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వర్షాకాలంలో ప్రబలుతున్న వ్యాధులను దృష్టిలో పెట్టుకుని, వాటి నివారణకు కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా చెత్తాచెదారం, ముళ్ల పొదల తొలగింపు, డ్రైనేజీల పరిశుభ్రత, గుంతల్లో, రోడ్లపై మురికి నీటి తొలగింపు వంటి పనులను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పంచాయతీలకు నియమితులైన ప్రత్యేకాధికారులు ఎంపీఓల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్యక్రమాలను విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు...

వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. పల్లెల్లో ప్రారంభమైన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పరిశుభ్రత పనులను కొనసాగించనున్నారు. ప్రత్యేకాధికారి, ఎంపీఓల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్యక్రమాలను విజయవంతం చేసేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

- పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వర్షాకాలం కావటంతో ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తారు.
- జిల్లాలో 61 పంచాయతీల్లో కలిపి మొత్తం 778 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతి 500 మంది జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడి చొప్పున 61 గ్రామ పంచాయతీల్లో 778 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో వీరు ప్రత్యేక కార్యాచరణలో భాగస్వాములు కానున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారులు కూడా పర్యవేక్షిస్తారు..

పారిశుద్ధ్యం ఇలా...

పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీ కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా ప్రోత్సాహం అందించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రైడే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీట్యాంకులు, పశువులు తొట్లను శుభ్రం చేయడం, లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయించటం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. వైకుంఠ ధామాలకు విద్యుత్, నీటి వసతి కల్పించడం, తడి, పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ. శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి, పాడుబడిన బావులను పూడ్చివేయడం, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు తొలగించడం వంటి పనులు చేయాలి. ప్రభుత్వ ప్రజోపయోగ సంస్థల్లో శుభ్రత పనులు, ఇంకుడు గుంతలను నిర్మించేలా చూడాల్సి ఉంది. మిగిలిపోయిన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం.



పనులపై ప్రత్యేక దృష్టి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించాం. ఇళ్లు, ట్యాంకులను శుభ్రం చేయడంపై అవగాహన కల్పిస్తున్నాం. పారిశుద్ధ్య కార్యక్రమంపై ప్రత్యేక కార్యాచరణ అమలుకు గ్రామాల వారీగా మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు.

– వెంకయ్య, డీపీఓ, మేడ్చల్ జిల్లా